సాక్షి ఖమ్మం

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



చక్రస్నానం, పూర్ణాహుతి

జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. 10లో



గాలివాన బీభత్సం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గాలివాన బీభత్సం కారణంగా మొక్కజొన్న, వరి నేలవాలగా తోటల్లో మామిడికాయలు రాలిపోయాయి. 8లో



వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం వాతావరణం కాస్త చల్లగానే ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత మాత్రం ఉష్ణోగ్రత పెరుగుతుంది.



పట్టాభిషేకం సందర్భంగా నదీజలాలతో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

శ్రీసీతారాముల పట్టాభిషేకం అనంతరం సింహాసనంపై బంగారు ఛత్రం అమరుస్తున్న అర్చకులు



రాజముద్రికను చూపిస్తున్న అర్చకుడు



భద్రాద్రి రామయ్యకు పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం

- మిథిలా స్టేడియంలో కనుల పండువగా వేడుక
- పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ తమిళి సై
- వేడుకను తిలకించిన వేలాది మంది భక్తులు

రాజాధిరాజుగా..

సంతోషంగా ఉంది : గవర్నర్

తెలంగాణ, దేశం సుభిక్షంగా ఉండాలని రాముడిని వేడుకున్నట్లు గవర్నర్ తమిళిసై తెలిపారు. పట్టాభిషేకం వేడుక ముగిసిన తర్వాత గవర్నర్ విలేకరులతో తెలుగులో మాట్లాడారు. స్వామివారి పుష్కర పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొని, పట్టువస్త్రాలు సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. మొదట అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్న గవర్నర్‌కు అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీ లక్ష్మీ తాయారమ్మవారి ఆలయంలో పండితులు వేదాశీర్వచనం, ఈఓ రమాదేవి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

భద్రాచల దివ్యక్షేత్రం అయోధ్యపురిగా మారింది. సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు రాజాధిరాజుగా పట్టాభిషేకం చేసేందుకు మిథిలా స్టేడియం వేదికగా మారింది. రామచంద్రస్వామితో పాటు సీతమ్మవారు కూడా స్వర్ణ కిరీటాన్ని ధరించిన మధుర దృశ్యాలు తిలకించిన భక్తులు జేజేలు పలికారు. శ్రీరామ నామస్మరణలతో పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. – భద్రాచలం

స్వర్ణ సింహాసనంపై రారాజుగా..

శ్రీ సీతారాముల కల్యాణం జరిగిన మరుసటి రోజున స్వామివారికి పట్టాభిషేకం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది పుష్కర సామ్రాజ్య మహా పట్టాభిషేకోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 22 నుంచే యాగశాలలో ప్రత్యేక పూజలకు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం యాగశాలలో చతుఃస్థానార్చన హోమం నిర్వహించారు. 10 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీ సేవగా మేళతాళాలతో మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. మహాపట్టాభిషేక క్రతువు సజావుగా సాగాలంటూ మొదట విశ్వక్సేన పూజ చేశారు. పూజా ద్రవ్యాలకు పట్టాభిషేక యోగ్యత కలగాలని పుణ్యావాచనం, సంప్రోక్షణ చేశారు. దైవాలలో ఒక్క శ్రీరాముడికి తప్ప మరెవరికీ పట్టాభిషేకయోగం లేదని అర్చకులు స్వామివారి ఔన్నత్యాన్ని వివరించారు. పుష్కర పట్టాభిషేకం సందర్భంగా అర్చకులు బృందాలుగా విడిపోయి దేశంలోని మూడు సముద్రాలు, 12 నదులు, 12 పుష్కరిణుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం చేశారు. అష్టోత్తర, సహస్ర నామార్చన, సువర్ణ పుష్పార్చన గావించారు. మండపంలో పంచ కుండాత్మక–పంచేష్ఠి సహిత చతుర్వేద హవన పురస్కృతంగా వేదపండితులు క్రతువు నిర్వహించారు. స్వామివారికి దాతలు సమర్పించిన స్వర్ణ తాపడ సింహాసనంపై కొలువుదీర్చడం, రామయ్యతో పాటు సీతమ్మ వారికీ స్వర్ణ మకుటధారణ చేయడం ఈ ఏడాది ఉత్సవాల్లో ప్రత్యేకతగా నిలిచింది.



గవర్నర్ తమిళిసైకి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ అనుదీప్, ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు



పట్టాభిషేకం అనంతరం స్వర్ణ కిరీటాలతో శ్రీసీతారామచంద్రులు

రామయ్య పట్టాభిషిక్తుడైన వేళ..

మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత స్వర్ణ సింహాసనంపై స్వర్ణ ఛత్ర, స్వర్ణ పాదుక, రాజదండ, రాజపట్టు, రాజముద్ర, వజ్రకిరీటాలను భక్తులకు చూపిస్తూ స్వామివారికి అలంకరించారు. నాటి మహర్షులు, అష్టదిక్పాలకులు, శ్రీరాముని సేనను వివరిస్తూ రామచంద్రమూర్తిని పట్టాభిషిక్తుడిని చేశారు. త్రేతాయుగంలో శ్రీరాముని మహాపట్టాభిషేకం స్మరణకు వచ్చేలా అదే చైత్ర పుష్యమి ముహూర్తాన భద్రాచలంలో పట్టాభిషేకం జరిపారు. యావత్ లోకానికి రామరాజ్య పాలన ఆదర్శంగా నడిచిందని, అదే పాలనతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు పట్టాభిషేకం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు, వేద పండితులు తెలిపారు. ఈ వేడుకకు ప్రత్యేక అతిథులుగా అహోబిల జీయర్‌స్వామి, దేవరాజ జీయర్‌స్వామి హాజరయ్యారు. కాగా, సాయంత్రం జరగాల్సిన రథోత్సవాన్ని వర్షం కారణంగా రద్దు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్, గవర్నర్ సెక్రటరీ సురేంద్రమోహన్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్న కళ్యాణి, ఆలయ ఈఓ రమాదేవి, మాజీ ఈఓ శివాజీ, ఈఈ రవీందర్, ఏఈఓ భవాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పట్టాభిషేకాన్ని వీక్షిస్తున్న గవర్నర్ తమిళిసై, మంత్రి సత్యవతి, భక్తులు

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పూజలు

రాష్ట్ర, దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని శ్రీసీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశాం. సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారు. ఇదే పాలనను మున్ముందు కూడా అందించాలని, ఆయనకు రాముడు సంపూర్ణ ఆరోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థన చేశాం. – సత్యవతి రాథోడ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

ఆదాయం అదుర్స్!

- ఎక్సైజ్, రవాణా శాఖలకు పెరిగిన ఆదాయం
- రవాణ శాఖకు లక్ష్యానికి మించి రూ.14.76 కోట్లు అధికం
- ఎక్సైజ్ శాఖకు ఏకంగా రూ.2,271 కోట్ల రాబడి
- రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలో స్వల్ప తగ్గుదల
- 'రియల్' వ్యాపారం లేక రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలు శుక్రవారంతో ముగిసిన ఆర్థిక సంవత్సరాని(2022–23)కి గణనీయమైన ఆదాయాన్ని ఆర్జించాయి. ప్రధానంగా ఎక్సైజ్, రవాణా శాఖల్లో జోష్ కనిపించింది. ఈ శాఖలకు లక్ష్యానికి మించి ఆదాయం నమోదైంది. కరోనా మహమ్మారి కారణంగా గత రెండేళ్ల ప్రభుత్వ శాఖలకు ఆదాయం అంతగా లభించలేదు. అటు రవాణా శాఖ, ఇటు ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలూ లక్ష్యాలను చేరుకోలేకపోయాయి. కానీ ఈసారి ఎలాంటి ఆటంకాలు లేకపోవడంతో మంచి ఆదాయాన్ని రాబట్టాయి. ప్రధానంగా రవాణా శాఖ లక్ష్యాని కంటే రూ.14.76 కోట్లు ఎక్కువగా ఆర్జించగా, ఎక్సైజ్ శాఖలోనూ ఇదే పరిస్థితి ఉంది.

రవాణా శాఖ భేష్

రవాణాశాఖలో ఈ ఏడాది ఆదాయం లక్ష్యానికి మించి నమోదైంది. 2022–23 ఏడాదిలో రవాణాశాఖ ఆదాయం రూ.131.87 కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా.. అంతకు మించి రాబట్టారు. శుక్రవారం నాటికి రూ.146.63 కోట్లు ఆర్జించగా, లక్ష్యానికంటే రూ.14.76 కోట్లు అధికంగా లభించినట్లయింది. గత రెండేళ్లుగా కరోనా కారణంగా రవాణా శాఖకు అంతగా కలిసిరాలేదు. కాగా, 2021–22లో మాత్రం రూ.82 కోట్ల లక్ష్యం నిర్దేశించగా రూ.98 కోట్ల మేర ఆదాయం లభించింది.

ఎక్సైజ్ కళకళ


ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ శాఖకు గత ఆర్థిక సంవత్సరం 30,42,442 కేసుల మద్యం, 11,28,369 కేసుల బీర్ల అమ్మకంతో రూ.2,029 కోట్ల ఆదాయం నమోదైంది. కానీ ఈసారి ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 29,01,525 కేసుల మద్యం, 16,49,499 కేసుల బీర్ల అమ్మకంతో ఏకంగా రూ.2,271 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం పోలిస్తే ఇది రూ.242 కోట్లు ఎక్కువ కావడం విశేషం.

రిజిస్ట్రేషన్లు కాస్త డౌన్..

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయం కొంతమేర తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ భారీగా తగ్గినా ఆదాయం మాత్రం స్వల్పంగానే కోల్పోయింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 57,816 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 46,562 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. అంటే 11,254 డాక్యుమెంట్లు తగ్గాయి. కానీ ఈ ఏడాది ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజు, భూమి విలువ, ఇతర పన్నులు పెంచడంతో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తగ్గినా ఆదాయంలో కొద్దిమేర మాత్రమే తగ్గుదల కనిపించింది. 2021–22 ఏడాదిలో రూ.230.63 కోట్ల ఆదాయం రాగా.. ఈసారి రూ.224.03 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక ఈ ఏడాదిలో ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో రూ.107.76 కోట్లు ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇక్కడ రూ.92.54 కోట్ల ఆదాయమే నమోదైంది.

ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్లు, ఆదాయం వివరాలు

వివరాలు	2021-22	2022-23
డాక్యుమెంట్లు	57,816	46,562
స్టాంప్ డ్యూటీ	రూ.173,43,49,000	రూ.166,91,52,000
ట్రాన్స్‌ఫర్ డ్యూటీ	రూ.26,82,09,000	రూ.25,33,64,000
రిజిస్ట్రేషన్ ఫీజు	రూ.30,38,39,000	రూ.31,78,10,000
మొత్తం ఆదాయం	రూ.230,63,97,000	రూ.224,03,26,000



న్యూస్‌రీల్

ఖైదీలు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలి



ఖైదీలు వేసిన పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న న్యాయమూర్తి జావేద్‌పాషా

ఖమ్మంలీగల్: జైలులో ఖైదీలుగా, విచారణ ముద్దాయిలుగా ఉన్నవారు వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే విడుదలయ్యాక ఉపాధి అవకాశాలు బాగుంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెంలోని జిల్లా జైలును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కారాగారంలోని కర్మాగారంలో పనిచేస్తున్న, శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. కారాగారాలు పరివర్తనాలయాలుగా ఉన్న నేపథ్యాన బయటకు వెళ్లాక ఉపాధికి ఇబ్బంది లేకుండా శిక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పనిచేస్తూనే ఇతరులకు శిక్షణ ఇస్తున్న ముద్దాయి వెంకటరెడ్డితో పాటు జైలు గోడలపై చిత్రాలను వేసిన ఖైదీలను అభినందించారు. జైలు అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–సేవల్లో భేష్..

- పాలేరు పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు
- 'సుపరిపాలన' విభాగంలో ప్రకటించిన ప్రభుత్వం
- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అందుకున్న సర్పంచ్, కార్యదర్శి

కూసుమంచి: ఈ–గవర్నెన్స్‌లో భాగంగా సేవలన్నీ ఆన్‌లైన్ చేయడంతో పాటు సర్టిఫికెట్లు జారీతో ఉత్తమ సేవలందిస్తున్నందుకు జిల్లాలోని పాలేరు గ్రామపంచాయతీకి సుపరిపాలనా విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. శుక్రవారం రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచ్ ఎడవెల్లి మంగమ్మ, కార్యదర్శి నరేష్ అవార్డు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలోనే పాలేరుకు ఈ అవార్డు దక్కడం విశేషం.

ఆన్‌లైన్ సేవలు... డిజిటల్ చెల్లింపులు

పాలేరు జీపీలో సేవలే కాక చెల్లింపులు కూడా ఆన్‌లైన్ విధానంలోనే కొనసాగుతున్నాయి. నిర్ణీత సమయానికి గ్రామసభలు నిర్వహించటం.. ఈ సభల్లో మహిళలు, వృద్ధులు, బాలబాలికలకు ప్రాధాన్యం ఇవ్వటం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. జనన, మరణ, వివాహ ధృవీకరణ పత్రాల జారీ, ఇంటి నిర్మాణ అనుమతులు, పన్నుల చెల్లింపు ఇలా అన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండడంతో పాటు సర్టిఫికెట్లు డిజిటల్‌గా జారీచేస్తారు. చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలే డిజిటల్ చెల్లింపులే కావడం విశేషం. జీపీలోనే మీసేవ, పోస్టాఫీస్ ఏర్పాటుచేయడం ద్వారా దరఖాస్తులు చేసుకోవడం, పన్నుల చెల్లింపు సాఫీగా జరుగుతుండగా.. పాలేరు పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది.



మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మంగమ్మ, కార్యదర్శి నరేష్, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, డీఆర్డీఓ విద్యాచందన



గ్రామపంచాయతీలో ఆన్‌లైన్ సేవలు

ఆనందంగా ఉంది...



మా గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు రావటం ఆనందంగా ఉంది. మా పంచాయతీలో అన్ని సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లోనే అందిస్తాం. ఏ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నా ఆన్‌లైన్‌లోనే. ఇలాంటి సేవలు ప్రజలకు సౌకర్యంగా ఉంటున్నాయి. – ఎడవెల్లి మంగమ్మ, సర్పంచ్

మరిన్ని సేవలు అందిస్తాం...



గ్రామపంచాయతీలో అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే చేపడుతున్నాం. సిబ్బంది జీతభత్యాలు, ఇతరత్రా డిజిటల్ రూపంలోనే చెల్లిస్తున్నాం. ఇంటిపన్నులు కూడా ఆన్‌లైన్‌లోనే స్వీకరిస్తున్నాం. ప్రస్తుత అవార్డుతో సేవలు మరింత విస్తృతం చేస్తాం. – నరేష్, గ్రామ కార్యదర్శి

సకాలంలో సర్టిఫికెట్ వచ్చింది...



నేను మా బాబు పుట్టినరోజు ధృవీకరణపత్రం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. అనుకున్న సమయం కంటే ముందే సర్టిఫికెట్ జారీ చేశారు. మా పంచాయతీలో ఆన్‌లైన్ సేవలు బాగున్నాయి. ఏ పనైనా జాప్యం లేకుండా సకాలంలో పూర్తవుతుంది. – తోడేటి కృష్ణయ్య, గ్రామస్తుడు

సత్వర న్యాయం జరగాలి..

అట్రాసిటీ కేసులపై సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కేసుల దర్యాప్తును వేగంగా చేపట్టి గడువులోపు చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. అనంతరం సీపీ వారియర్ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో శిరీష, అదనపు డీసీపీ ఎస్.సీ.బోస్, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, ఆర్డీవోలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, ఏసీపీలు గణేష్, బస్వారెడ్డి, రెహమాన్, రామానుజం, డీటీడబ్ల్యూఓ కృష్ణానాయక్, సభ్యులు పాల్గొన్నారు.

- వాహనదారులంతా రహదారి నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్, సీపీ వారియర్‌మాట్లాడారు. రోడ్లకిరువైపులా ఆక్రమణల తొలగించి, విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని, తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్ అండ్ బీ ఈఈ శ్యాంప్రసాద్, డీఎంహెచ్‌ఓ మాలతి, పీఆర్ ఈఈ శ్రీనివాస్, ఆర్టీఓ కిషన్‌రావు, నేషనల్ హైవే పీడీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లాలో ఇటీవల భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతుల వివరాలు త్వరగా సేకరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమైన ఆయన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యాన రైతులు, కౌలు రైతుల వివరాలతో నివేదిక సిద్ధం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఏఓ విజయనిర్మల పాల్గొన్నారు.
- వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన ఆయన వివిధ జాతీయ రహదారులు, మూడో రైల్వే లైన్, సింగరేణి పనులకు కావాల్సిన భూసేకరణపై సమీక్షించి సూచనలు చేశారు.అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్త, జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, ఆర్డీవోలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, భూసేకరణ విభాగం డీటీ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.
- ఖమ్మంవైద్యవిభాగం: ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసిన వైద్యసేవలను పరిశీలించాక వైద్యులు, అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ మాలతి, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఆస్తి పన్ను భారీగా వసూలు

- కేఎంసీకి రూ.26.62 కోట్ల ఆదాయం
- చివరి రోజుకు రూ.1.10 కోట్ల వసూలుతో రికార్డ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. అధికారులు ఆస్తి పన్ను రూ.31,24,33,000 వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన శుక్రవారం నాటికి రూ.26,62,80,000 వసూలు చేయగలిగారు. గతేడాదితో పోలిస్తే ఇది రూ.4 కోట్లకు పైగా ఎక్కువ కావడం విశేషం. ఇక శుక్రవారం ఒక్కరోజే రూ.1.10 కోట్లు వసూలు చేశారు. కాగా, చివరి రో.జు పన్నులు చెల్లించేందుకు నగరవాసులు కేఎంసీ కార్యాలయంతో పాటు ప్రత్యేక కేంద్రాలకు వెళ్లగా సర్వర్లు మొరాయించడంతో కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి.

బార్ అధ్యక్షుడిగా దిరిశాల కృష్ణారావు

ప్రశాంతంగా ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మంలీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దిరిశాల కృష్ణారావు విజయం సాధించారు. బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించగా, ఉదయం 10నుంచి సాయంత్రం మూడు గంటల వరకు పోలింగ్ సాగింది. అనంతరం ఎన్నికల అధికారి ఎస్.సోమశేఖర్‌శర్మ ఆధ్వర్యాన ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు. ఈమేరకు అధ్యక్ష స్థానానికి పోటీలో ఉన్న దిరిశాల కృష్ణారావుకు 228 ఓట్లు రాగా, నేరెళ్ల శ్రీనివాస్‌కు 204 ఓట్లు రావడంతో 24 ఓట్ల మెజార్టీతో కృష్ణారావు విజయం సాధించారు. ఇంకా స్వర్ణకుమారికి 135 ఓట్లు, సుధీర్‌సింగ్‌కు 118 ఓట్లు, తౌఫిక్ అహ్మద్‌కు 49 ఓట్లు, అప్పారావుకు 13 ఓట్లు వచ్చాయి. కాగా, ప్రధాన కార్యదర్శి స్థానానికి పోటీ పడిన మన్నేపల్లి బసవయ్యకు 389 ఓట్లు రాగా, చింతనిప్పు వెంకట్‌కు 353 ఓట్లు రావడంతో బసవయ్య 36 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అలాగే, సంయుక్త కార్యదర్శిగా విజయ రాఘవ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా రావుల వెంకట్ విజయం సాధించారు.



అధ్యక్షుడిగా విజయం సాధించిన కృష్ణారావుతో ప్రధాన కార్యదర్శి బసవయ్య, తదితరులు

నలుగురు ఏకగ్రీవం

బార్ అసోసియేషన్‌లో ఉపాధ్యక్షులుగా మాదిరాజు లక్ష్మీనారాయణ, గ్రంథాలయ కార్యదర్శిగా గాజుల అమర్‌నాథ్, కోశాధికారిగా మిర్యాల ప్రవీణ్‌కుమార్, మహిళా ప్రతినిధిగా కేవీవీ.లక్ష్మి గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా పదవులకు ఒక్కో నామినేషనే దాఖలు కావడంతో ఏకగ్రీవమైన ప్రకటించారు. కాగా, శుక్రవారం ఫలితాలు వెలువడ్డాక విజయం సాధించిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు.

క్లుప్తంగా

జిల్లా ఆస్పత్రి నిర్వహణ భేష్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ బాగుందని, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఉందని కాయకల్ప బృందం కితాబిచ్చింది. కాయకల్ప బందం సభ్యుడు, ములుగు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ రఘు, గాంధీ హస్పటల్ అధికారులు డాక్టర్ రెహమాన్, సిద్దిక్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్టెల్లా తదితరులు శుక్రవారం ఖమ్మం జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. గతంలో రెండుసార్లు జిల్లా ఆస్పత్రి కాయకల్ప అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో ఈ ఏడాది అవార్డుకు సిఫారసు చేసేందుకు ఆస్పత్రిలో వసతులు, నిర్వహణ, చికిత్సపై వివరాలు ఆరా తీశారు. ఈసందర్భంగా చికిత్స, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు కాయకల్ప అవార్డుకు సిఫారసు చేయనున్నట్లు చెప్పారని సమాచారం. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణ, క్వాలిటీ మేనేజర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీవీ ప్యాట్ల పనితీరు పరిశీలన



వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఆవరణలో గోడౌన్‌ను అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల జిల్లాకు కొత్తగా 2,197 వీవీ ప్యాట్లను కేటాయించారు. ఈమేరకు ఆయన వీవీ ప్యాట్ల పనితీరును పరిశీలించి భద్రతపై సూచనలు చేశారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

400మందికి ఆరు యూనిట్లా?



రహదారిపై ఆందోళనకు దిగిన ముస్లింలు

ముదిగొండ: మండలంలోని 400మందికి పైగా ముస్లింలు ఉండగా ప్రభుత్వం ఆరు సబ్సిడీ యూనిట్లను మంజూరు చేసింది. ఈసమాచారం అందుకున్న ముస్లింలు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈక్రమంలో అధికారులు డ్రా పద్ధతిన యూనిట్లు కేటాయిస్తామని వెల్లడించగా, వారు ససేమిరా అన్నారు. దీంతో యూనిట్ల డ్రా నిలిపివేయడం ముస్లింలు ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసిన అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈక్రమంలో మేరకు వనంవారికృష్ణాపురానికి చెందిన జమాల్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు నిలువరించి స్టేషన్‌కు తరలించారు.

అనారోగ్య సమస్యతో వృద్ధుడి ఆత్మహత్య

ఏన్కూరు: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని జన్నారం ఎస్టీ కాలనీకి చెందిన వేములు చిన్న యాలాద్రి(77) కొంత కాలంగా కిడ్నీ, గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని తరచూ చెప్పాడు. ఈక్రమంలోనే గురువారం ఇంట్లోనే కలుపు మందు తాగిన ఆయన ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఆయన కుమారుడు నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఇద్దరిపై మూకుమ్మడి దాడి

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో వెల్డింగ్ వర్క్‌షాపు వద్ద ఇద్దరిపై శుక్రవారం మూకుమ్మడి దాడి జరిగింది. ఖమ్మం రూరల్ మండలం తెల్దార్‌పల్లికి చెందిన ఎనిమిది మంది వెల్డింగ్ వర్క్ షాప్ వద్దకు వచ్చి పవన్ ఉన్నాడా అని ఆరా తీస్తూ షాపులోని సామగ్రిని ధ్వంసం చేశారు. అంతేకాకుండా అక్కడే ఉన్న సునీల్, పవన్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు వెల్లడించారు.

వైన్స్ నిర్వాహకులపై ఫిర్యాదు

నేలకొండపల్లి: ధర మా ఇష్టం, బ్రాండ్ కూడా మేం అమ్మేదే తీసుకోవాలి అంటూ మండలంలోని చెరువుమాధారం వైన్స్ నిర్వాహకులు బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యాన స్థానికులు పలువురు శుక్రవారం ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశారు. ప్రతీ మద్యం బాటిల్‌పై రూ.20అదనంగా తీసుకుంటుండమే కాక ఇష్టం వచ్చిన బ్రాండ్లు అమ్ముతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక బెల్ట్‌షాపులకు మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

గాలి, వాన బీభత్సం

- నేలవాలిన మొక్కజొన్న, వరి పంటలు
- కల్లాల్లో తడిసిన మిర్చి, ధాన్యం
- నేలరాలిన మామిడి కాయలు

జిల్లాలో శుక్రవారం సాయంత్రం పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. చెట్లు విరిగిపడగా, ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపోయాయి. బొప్పాయి, మామిడి కాయలు రాలిపోయాయి. వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది.



ఎర్రుపాలెం : బుచ్చిరెడ్డిపాలెంలో అకాల వర్షానికి నేలరాలిన మొక్కజొన్న

తడిసిన మిర్చి..

మధిర: అకాల వర్షానికి మండలంలో మొక్కజొన్న, మిర్చి పంటలకు తీవ్ర నష్టం కలిగింది. సైదల్లిపురం గ్రామంలో ఉప్పెల పకీరారెడ్డి, ఐలూరి పుల్లారెడ్డి తదితర రైతులకు చెందిన మొక్కజొన్న పైర్లు నేలవాలాయి. అదేవిధంగా సిరిపురం, మాటూరు, నిధానపురం, దేశినేనిపాలెం తదితర గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిచింది. నాగవరప్పాడులో పల్లపోతుల శ్రీనివాసరావుకు చెందిన వరిగడ్డివాముపై పిడుగు పడటంతో రూ.30వేల విలువైన గడ్డి కాలిపోయింది. అలాగే, ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరాలు కూడా దగ్ధమయ్యాయి.

వేప చెట్టుపై పిడుగు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెంలో మొరబోయిన నాగేశ్వరరావు ఇంటి ఆవరణలోని వేప చెట్టుపై పిడుగుపడింది. దీంతో చెట్టు చీలిపోయింది. అలాగే, నాగేశ్వరరావు ఇంట్లో విద్యుత్ ఉపకరణాలన్నీ కాలిపోయినా ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇక మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం, అయ్యవారిగూడెం, జమలాపురం, భీమవరం, వెంకటాపురం, నారాయణపురం, ఎర్రుపాలెం, మీనవోలు, తక్కెళ్లపాడు గ్రామాల్లో పెనుగాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కారణంగా చేతికొచ్చిన మొక్కజొన్న పంట నేలరాలింది. అలాగే, తోటల్లో మామిడికాయలు నేలరాలాయి.

గాలి దుమారంతో వర్షం

తల్లాడ: తల్లాడలో గాలి దుమారం, ఉరుములతో కూడిన వర్షం గంట పాటు కురిసింది. దీంతో మామిడి, మొక్క జన్నొ పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలు నేలరాలగా, మొక్కజొన్న పైరు గాలికి కింద పడిపోయింది.

రైతులు పరుగులు

ఏన్కూరు: మండలంలో భారీవర్షం కురవగా, పలుచోట్ల మొక్కజొన్న పంట నేలకొరిగింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. మండలంలో కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. ఈదురు గాలులకు కేజీబీవీ ఎదురుగా చెట్టుకొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే, పలువురి తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయి.



ఎర్రుపాలెం : నేలరాలిన మామిడికాయలు



బోనకల్ : నేలరాలిన మామిడికాయలు

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పెనుబల్లి : మండలంలో పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలితో కూడిన వర్షం రావడంతో చెట్ల కొమ్మలు విద్యుత్తు లైన్లపై పడగా అడవిమల్లెల, కేఎం బంజర్‌తో పలు గ్రామాల్లో స్తంభాలు విరిగిపోయాయి. కాగా, గాలి దుమారం ధాటికి మామిడి కాయలు భారీగా నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



ఏన్కూరు : మిర్చి పట్టాలపై నిలిచిన నీరు



మధిర : పిడుగుపాటుకు కాలిపోయిన వరిగడ్డి



తల్లాడ : రాష్ట్రీయ రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు



పెనుబల్లి : అడవిమల్లెలలో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించిన ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: తెలంగాణలో అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రప్రభుత్వం నిధులు విడుదలలోనూ నిర్లక్ష్యం వహిస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లి మండల స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరగనుండగా, విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని బేతుపల్లిలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి ఆయన ఆహ్వానపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణలో పథకాలను చూసి అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈక్రమంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. కాగా, 3వ తేదీన వేంసూరు మండలం బీరాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద మండల స్థాయి సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. ఎంపీపీలు దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్య, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు, సర్పంచ్‌లు మందపాటి శ్రీనివాసరెడ్డి, పాకలపాటి శ్రీనివాసరావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి రామారావు, యాగంటి శ్రీనివాసరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మోదుగు పుల్లారావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, నాయకులు

జోరుగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు



పోటీల్లో బండను లాగుతున్న ఎద్దులు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో ఇంటూరి శేఖర్ యువసేన ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండలాగు పోటీలు, మహిళల జాతీయ ప్రో కబడ్డీ పోటీలు శుక్రవారం రెండోరోజుకు చేరాయి. ఈసందర్భంగా పోటీలను డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కందాళ విజయమ్మ ప్రారంభించారు. జూనియర్స్ విభాగంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి ఆరు జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. ఇక ప్రో కబడ్డీ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫ్లడ్‌లైట్ల కాంతుల్లో జరుగుతున్న ఈ పోటీలను వీక్షించేందుకు మండలంతో పాటు ఇతర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. పోటీలను నిర్వాహకుడు, డీసీసీబీ డైరక్టర్ ఇంటూరి శేఖర్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

ముగిసిన ఉత్సవ విగ్రహాల వివాదం

బోనకల్: మండలంలోని ఆళ్లపాడులో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు విషయంలో రెండు వర్గాల నడుమ నెలకొన్న ఉద్రిక్తత శుక్రవారం చల్లారింది. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యాన గురువారం కల్యాణం నిర్వహించాక ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా రామాలయానికి తీసుకొచ్చేసరికి తాళం వేసి ఉండడంతో బయటే పెట్టారు. ఈక్రమంలో ఎస్ఐ తేజావత్ కవిత శుక్రవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను పిలిపించి సయోధ్య కుదిరించడంతో వివాదం ముగిసింది. దీంతో కాంగ్రెస్ నేతలు కల్యాణం జరిపించిన ఉత్సవ విగ్రహాలను కూడా రామాలయంలో పెట్టారు.



విగ్రహాలను రామాలయంలో తీసుకెళ్తున్న దృశ్యం

మొదలైన ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు పూర్తయిన సందర్భంగా జవాబుపత్రాల మూల్యాంకనం చేపట్టారు. ఈమేరకు ఖమ్మంలోని నయాబజార్ కళాశాలలో క్యాంపు ఏర్పాటుచేయగా, జిల్లాకు 4,18,391 జవాబుపత్రాలను కేటాయించారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) కె.రవిబాబు తెలిపారు. క్యాంప్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన పర్యవేక్షకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. శుక్రవారం మొదటి విడత మూల్యాంకనం ప్రారంభం కాగా... 4, 6, 9వ తేదీల్లో దఫదఫాలుగా మూల్యాంకనం మొదలవుతుందని తెలిపారు. కాగా, మూల్యాంకనం విధుల్లో 1,500మంది పాల్గొంటున్నారని డీఐఈఓ చెప్పారు.

ఒంటరి మహిళను కట్టేసి చోరీ

కొణిజర్ల: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను మంచానికి కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి రూ.32 వేల నగదు ఎత్తుకెళ్లిన ఘటన కొణిజర్లలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల ఎస్సీ కాలనీకి చెందిన వెంగళ సులోచన మధ్యాహ్నం ఇంట్లో టీవీ చూస్తుండగా మాస్క్ ధరించిన ఇద్దరు వ్యక్తులు చొరబడి మంచంపై పడుకుని ఉన్న సులోచన చేతులు, కాళ్లు కట్టాక పక్కనే బీరువాలో దాచిన రూ.32 వేల నగదు ఎత్తుకెళ్లారు. కాసేపటికి ఆమె అతి కష్టంపై ఫోన్ దగ్గరకు తీసుకుని సమీప బంధువులకు ఫోన్ చేసి మాట్లాడకుండా మూలుగుతుండడంతో అనుమానంగా వారు వచ్చేసరికి చేతులు, కాళ్లు కట్టేసిన సులోచన కనిపించడంతో కాపాడారు. దీంతో వైరా సీఐ టి.సురేష్, కొణిజర్ల ఎస్సై జె.శంకరరావు క్లూస్‌టీం చేరుకుని వేలిముద్రలు సేకరించారు. అలాగే, కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. మూడు రోజుల పాటు పాత స్లాబ్ పగులగొట్టి రెక్కలుముక్కలు చేసుకుని సంపాదించుకున్న సొమ్ము ఎత్తుకెళ్లడంతో సులోచన కన్నీరుమున్నీరవుతోంది.



ఘటన వివరాలు వెల్లడిస్తున్న బాధిత మహిళ సులోచన

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- స్నేహితుల వేధింపులే కారణం?

వైరా: వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కదారి దీప్తి శుక్రవారం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తోటి విద్యార్థినుల వేధింపులు తట్టుకోలేకే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. వైరా బీసీ కాలనీకి చెందిన ఆమెను మెరుగైన వైద్యం కోసం పాఠశాల ఉద్యోగులు ఖమ్మం తరలించినట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు మొదలుకానున్న నేపథ్యాన బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పాఠశాలలో ఆందోళన నెలకొంది.

వ్యక్తి మృతిపై పోలీసులకు ఫిర్యాదు

తిరుమలాయపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందగా.. ఆయన భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని తిప్పారెడ్డిగూడెంకు చెందిన రావుట్ల రాజేశ్వరాచారి(45) పది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికాగా, చికిత్స చేయించాక ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ అనారోగ్యానికి గురైన ఆయన 29వ తేదీన ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. అయితే, కారణాలేమిటో తెలియరాకున్నా ఆస్పతి ఆర్ఎంఓ అనుమానం వ్యక్తం చేయడంతో మృతుడి భార్య సుగుణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి..

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేతృత్వాన ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలని కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ కోరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో ఆయనపై వేటు వేయడం ద్వారా ప్రతిపక్షమే ఉండొద్దనే ఆలోచనకు బీజేపీ వచ్చినట్లు తెలుస్తోందన్నారు. ఈమేరకు ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి పార్టీలకతీతంగా అందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షులు, పీసీసీ సభ్యులతో సమావేశమయ్యారు. నాయకులు రాయల నాగేశ్వరరావు, బైరెడ్డి మనోహర్ రెడ్డి, శీలం ప్రతాప్‌రెడ్డి, మాలోత్ రాందాస్‌నాయక్, బెల్లం శ్రీనివాస్, యడ్లపల్లి సంతోష్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మద్ది వీరారెడ్డి, మలీదు వెంకటేశ్వర్లు, పల్లెబోయిన భారతి చంద్రం,లకావత్ సైదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

మతసామరస్యానికి ప్రతీక

దర్గాలో శ్రీరామ పట్టాభిషేకం

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారు హజరత్ నాగుల్‌మీరా దర్గా చిల్లాలో శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణ, భక్తుల శ్రీరామ నామస్మరణతో దర్గా ప్రాంగణం మార్మోగింది. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను పురస్కరించుకుని భక్తులు నాట్యప్రదర్శనతో అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ నాగుల్‌మీరా దర్గా మతసామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. నాగుల్‌మీరా దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ళ మాధవరావు, వార్డు కౌన్సిలర్లు వారా రవి, బీఆర్ఎస్ నాయకులు పర్చూరి వెంకటేశ్వరరావు, సుమన్, గిన్నారపు రాజేష్, భక్తులు పాల్గొన్నారు.



నాగుల్‌మీరా దర్గాలో సీతారాములకు పూజ చేస్తున్న వేదపండితులు



వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ముస్లింలు

క్లుప్తంగా...

ముగిసిన జీ20 సదస్సు

విశాఖలో 4 రోజులు కొనసాగిన సమావేశాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ వేదికగా మార్చి 28 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన జీ 20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఇండియా ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో 'రేపటి ఆర్థిక నగరాలు – అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన అవకాశాలు'పై ప్రధానంగా సదస్సు జరిగింది. 14 సభ్య దేశాలు, ఎనిమిది అతిథి దేశాలు, పది అంతర్జాతీయ సంస్థలకు చెందిన 57 మంది ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. యూఎన్‌డీపీ, ఓఈసీడీ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, ఈబీఆర్‌డీ లాంటి అంతర్జాతీయ సంస్థల నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ సదస్సుకు అధ్యక్షత వహించారు.

త్వరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

అమిత్ షా హామీ ఇచ్చారు: ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: త్వరలోనే బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, బడ్జెట్ కూడా పెంచుతామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరడి భూపేష్ సాగర్ తదితరులతో కూడిన బృందం శుక్రవారం అమిత్‌షాతో భేటీ అయింది. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కుల గణన చేపట్టాలని, పట్టికలో దీనిని అదనంగా చేర్చాలని, బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు, పదోన్నతుల్లో, న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్లు, క్రీమిలేయర్ తొలగింపు, రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ తదితర 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అమిత్ షాకు అందజేసింది. అనంతరం ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే, ఎల్ఐసీ, బ్యాంకింగ్ తదితర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని అమిత్‌షాకు తెలిపినట్లు చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు మినహాయిస్తే అన్ని ప్రభుత్వాలూ కులగణనకు మద్దతిచ్చాయని, బీజేపీకి బీసీల పట్ల వివక్ష ఎందుకని ప్రశ్నించామన్నారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవని, వాటి పరిష్కారానికి చొరవ చూపుతానని అమిత్‌షా హామీ ఇచ్చారన్నారు.

'మార్గదర్శి' డాక్యుమెంట్లే సీజ్

- ఇతర ఏ సంస్థ వివరాలూ మావద్ద లేవు
- నాంపల్లి మేజిస్ట్రేట్ కూడా దీన్ని ధ్రువీకరించారు
- తనిఖీలు ముగిసినందున పిటిషన్‌ను కొట్టివేయాలి
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఏపీ ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్, అనుబంధ సంస్థల డేటా మినహా మరే ఇతర సంస్థలకు చెందిన డేటా తాము సీజ్ చేసిన డాక్యుమెంట్లలో లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. సీజ్ చేసిన డాక్యుమెంట్ల జాబితాపై నాంపల్లి 14వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సంతకం చేశారని, ఆ కాపీని కోర్టుకు కూడా సమర్పించామని తెలిపింది. ఎలాంటి ఆధారాలు లేకుండా, విచారణను జాప్యం చేసేందుకే పిటిషనర్ ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేసింది. తమ సంస్థలో తనిఖీలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ బ్రహ్మయ్య అండ్ కో, పెద్ది చంద్రమౌళి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ కౌన్సిల్ పి.గోవిందరెడ్డి వాదనలు వినిపించారు.

తనిఖీలు ఆపాలని మాత్రమే కోరారు..

'మార్గదర్శిపై పలు ఆరోపణలున్నాయి. చిట్స్ ద్వారా వచ్చిన నగదును షేర్‌మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌కు మళ్లిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. ప్రధాన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఇది బడా వైట్ కాలర్ నేరం. సంస్థకు చెందిన పలు కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. బ్రహ్మయ్య అండ్ కో కార్యాలయ తనిఖీల్లో మాత్రం పోలీసులు పాల్గొన్నారు. ప్రధాన కేసు విచారణ సందర్భంగా పలు డాక్యుమెంట్లను అధికారులు అడిగారు. మార్గదర్శి చార్టర్డ్ అకౌంటెంట్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మం అండ్ కో వాటిని ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. తనిఖీలు ఆపాలని మాత్రమే పిటిషనర్ కోరారు. అవి ఎప్పుడో ముగిశాయి కనుక పిటిషన్‌ను కొట్టివేయాలి' అని గోవిందరెడ్డి కోర్టుకు నివేదించారు.

ప్రత్యేకంగా విచారణ ఎందుకు?

'మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి కోర్టు విధుల సమయం ముగిసిన తర్వాత కూడా ప్రత్యేకంగా విచారణ జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? సామాన్యుడికి ఏదైనా ప్రాణం మీదకు వస్తే కోర్టు ఇలాగే వ్యవహరిస్తుందా..? ఇది ఎంత వరకు సమంజసమో ఆలోచించాల్సిన అవసరం ఉంది. లంచ్‌మోషన్ పిటిషన్లు వేయడం, కోర్టు విధులు ముగిసిన తర్వాత అత్యవసరంగా విచారణ జరిపి ఉత్తర్వులు పొందడం ద్వారా మార్గదర్శికో నీతి – సామాన్యుడికో నీతి అనే అభిప్రాయం నెలకొనే అవకాశం ఉంది' అని విచారణ సందర్భంగా స్పెషల్ కౌన్సిల్ పి.గోవిందరెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను న్యాయమూర్తి ఏప్రిల్ 13వతేదీకి వాయిదా వేశారు.

తనిఖీలు ముగిశాక విచారణా?

తనిఖీలు ముగిసిన తర్వాత వాటిని ఆపాలన్న విజ్ఞప్తిపై ఇక విచారణ ఎలా కొనసాగిస్తామని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది నళిన్‌కుమార్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. ఆ పిటిషన్‌లో ఇంటర్ లొక్యుటరీ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశామని నళిన్‌కుమార్ నివేదించారు.

ఒంటిమిట్టలో వేడుకగా ధ్వజారోహణ



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. తొలుత శాస్త్రోక్తంగా హోమం, పూజలు నిర్వహించిన వేదపండితులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ధ్వజస్తంభంపై గ రుడ పతాకాన్ని ఎగురవేశారు.

– ఒంటిమిట్ట

మూడు రాజధానుల దీక్షా శిబిరంపై దాడి

- సీఎం జగన్‌పై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు
- వాటిని నిరసిస్తూ బహుజన పరిరక్షణ సమితి నేతల నిరసన
- శిబిరంపై విరుచుకుపడ్డ మాజీ మంత్రి అనుచరులు
- మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగేసిన వైనం
- ఈ గొడవను వైఎస్సార్‌సీపీ, బీజేపీ మధ్య ఘర్షణగా చిత్రీకరించేందుకు బాబు, పవన్‌ల యత్నం



దీక్షాశిబిరం వద్ద రెచ్చగొడుతున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు



బహుజన నేతలపై దాడులు చేస్తున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు, టీడీపీ నేతలు

తాడికొండ/సాక్షి, అమరావతి : అమరావతి దీక్ష శిబిరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మూడు రాజధానుల శిబిరం వద్ద నిరసన తెలిపిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలపై బీజేపీ ముసుగులోని టీడీపీ మాజీ మంత్రి అనుచరులు విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ఈ దాడులను బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య చోటుచేసుకున్న ఘర్షణగా చిత్రీకరిస్తూ టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రాజకీయ డ్రామాకు తెరతీశారు. అమరావతి దీక్షలు 1200వ రోజుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం మందడంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆదినారాయణరెడ్డి.. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌తో కలిసి వెళ్లారు. ఆ శిబిరంలో సీఎం జగన్‌పై ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయం తాళ్లాయపాలెం జంక్షన్‌లోని మూడు రాజధానుల శిబిరంలో 915వ రోజు దీక్షలు చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలకు తెలిసింది. కాసేపటి తర్వాత ఆదినారాయణరెడ్డి, సత్యకుమార్, వారి అనుచరులు విజయవాడకు బయలుదేరారు. వారి వాహన శ్రేణి మూడు రాజధానుల శిబిరం వద్దకు చేరుకోగానే.. బహుజన పరిరక్షణ సమితి నాయకులు రోడ్డు పక్కన నిల్చొని శాంతియుతంగా నిరసన తెలిపారు. ఆదినారాయణరెడ్డి డౌన్ డౌన్.. అమరావతి వద్దు.. మూడు రాజధానులే ముద్దు.. అంటూ నినదించడంతో ఆదినారాయణరెడ్డి అనుచరులు వారిపై విచక్షణా రహితంగా దాడులకు దిగారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలపై విరుచుకుపడ్డారు. మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగారు. వారు ప్రతిఘటించడానికి సిద్ధమవుతుండగా.. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనకు కారణమైన ప్రతిపక్ష నేత చంద్రబాబు, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష శిబిరాన్ని సందర్శించిన బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, ఆయన అనుచరులు, టీడీపీ నాయకులు శిబిరం వద్ద ఉన్న మహిళలను జుట్టు పట్టుకొని తన్నారని చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరిగిందన్నారు.

ఆదినారాయణరెడ్డి కోసమే..

మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి తీరుపై బహుజనులు నిరసన తెలపడంలో భాగంగానే ఈ సంఘటన జరిగిందని బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. ఆ ఘటన సమయంలో 'నా పేరు ఎవరూ ఎత్తలేదు.. ఆదినారాయణరెడ్డి కోసమే ఆరా తీశారు. ఆయన నా కారు ఎక్కలేదు. ఉదయం నేను, ఆయన కలిసి వెళ్లాం. సభ నుంచి ఆయన కాస్త ముందుగా వచ్చారు. ఆ విషయం వారికి తెలియదు. ఎవరో నా కారుపై దాడి చేశారు' అని వివరించారు. కాగా, సత్యకుమార్ కారుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటన గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ దాదాగిరీ పరాకాష్టకు చేరిందన్నారు.

రహదారులకు మహర్దశ ₹



- ఎన్‌హెచ్‌ల నిర్మాణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థత
- రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్న కేంద్రం
- నాలుగేళ్లలో సాధించిన నిధులు రూ.23,471.92 కోట్లు
- నాడు ఐదేళ్లలో టీడీపీ తెచ్చింది రూ.10,660 కోట్లే

సాక్షి, అమరావతి: ఏపీలో జాతీయ రహదారుల అభివృద్ధికి వరుసగా నాలుగో ఏడాదీ కేంద్రం నుంచి రికార్డు స్థాయిలో నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించింది. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఈ వార్షిక ప్రణాళికలో రూ.12,130 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వార్షిక ప్రణాళిక కింద ఆమోదించిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రహదారుల ప్రాజెక్టులను పరిశీలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తి చెందితేనే ఆమేరకు ఆర్థిక సంవత్సరం ఆఖరులో నిధులు మంజూరు చేస్తుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం పట్ల రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతో పూర్తి సంతృప్తి చెందినందున రికార్డు స్థాయిలో వార్షిక ప్రణాళిక నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్ తరువాత అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కే నిధులు మంజూరు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నాడు కేంద్రంలో అధికారాన్ని పంచుకుని కూడా

నాడు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా చంద్రబాబు జాతీయ రహదారుల అభివృద్ధికి తగిన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. ఐదేళ్లలో టీడీపీ సర్కారు కేవలం రూ.10,660 కోట్లు మాత్రమే తేగలిగింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఈ ఒక్క ఏడాదిలోనే రూ.12,123 కోట్లు సాధించడం విశేషం. మొత్తం నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ.23,471.92 కోట్లు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో రాష్ట్రంలో పారిశ్రామిక, తీర ప్రాంతాలు, ఎకనామిక్ జోన్లు, పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ రహదారుల అభివృద్ధి జోరందుకుంది.

సీఎం జగన్ ప్రణాళికకు కేంద్రం ఆమోదం

2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీతో చర్చిస్తూ పట్టుబట్టి నిధులను సాధిస్తున్నారు. 2019–20 వార్షిక ప్రణాళికలో తొలుత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.600 కోట్లే కేటాయించింది. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి జగన్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ దృష్టికి తేవడంతో 2019–20లో రాష్ట్రానికి నిధుల కేటాయింపును రూ.1,304.42 కోట్లకు పెంచారు. ఇక 2020–21 వార్షిక ప్రణాళికలో కేంద్రం రూ.2,476.50 కోట్లు మంజూరు చేయగా, 2021–22లో ఏకంగా రూ.7,561 కోట్లు మంజూరు చేసింది. ఆ ఆర్థిక సంవత్సరంలో దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు కేటాయించడం గమనార్హం.

541.45 కి.మీ. మేర 24 ప్రాజెక్టులు

2022–23కి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళిక నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 24 ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. రూ.11699.55 కోట్లతో ఇప్పటికే 513.72 కి.మీ. మేర 21 ప్రాజెక్టులను పూర్తి చేసింది. రూ.431.27 కోట్లతో 27.73 కి.మీ.మేర మూడు ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. అవి కూడా త్వరలో పూర్తి చేయనున్నారు.

జిల్లా వార్తలు

2నుంచి ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు

నేలకొండపల్లి: ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లిలో ఈనెల 2న మొదలుకానున్నాయి. ఆసక్తి కలిగిన క్రీడాకారులు రూ.400 చెల్లించి జట్టు వివరాలు నమోదు చేసుకోవాలని అంబేద్కర్ యూత్ బాధ్యులు సూచించారు. వివరాల కోసం 96664 20008, 70139 45976, 63094 59150 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సీతారామకు రూ.60 కోట్లు నిధులు

- మాజీ మంత్రి తుమ్మల వెల్లడి



సీఎంతో మాట్లాడుతున్న తుమ్మల, సండ్ర (ఫైల్)

సత్తుపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకానికి రాష్ట్రప్రభుత్వం రూ.60 కోట్లు నిధులు విడుదల చేసిందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన సత్తుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భూములకు గోదావరి జలాలను అందించాలనే లక్ష్యంతో సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మిస్తుండగా, తాజాగా మంజూరైన నిధులతో పనులు వేగవంతమవుతాయని తెలిపారు. ఇటీవల జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తాను కలిసి సీతారామ కాల్వ పనుల్లో జాప్యం, సత్తుపల్లి ట్రంక్‌లో యాతాలకుంట సమీపాన టన్నెల్, భూసేకరణ సమస్యలపై విన్నవించగా నిధులు విడుదల చేశారని తెలిపారు. ప్రస్తుత నిధులతో యాతాకుంట వద్ద ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్న వారికి పరిహారం ఇచ్చి టన్నెల్ పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించినట్లు వెల్లడించారు.

రూ.7.23 కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రేగళ్ల వెంకటేశ్వర్లు అరవై మందిని ప్రతివాదులుగా పేర్కొంటూ శుక్రవారం ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.7,23,40,000కు ఐపీ దాఖలు చేశారు. 2018 నుంచి రియల్ ఎస్టేట్, మద్యం వ్యాపారాలు చేస్తున్న వెంకటేశ్వర్లు పలువురి వద్ద అప్పు తీసుకున్నాడు. కానీ ఆ అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందని, రుణదాతలు దాడులకు దిగుతున్నారని దివాళా పిటీషన్‌లో పేర్కొన్నాడు. ఈమేరకు తనను దివాలాదారుగా ప్రకటించడమే కాక పోలీసు రక్షణ కల్పించాలని ఆయన కోరాడు.

ఈసారీ అయిపాయె...

- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వెనుకంజ
- ఆర్థిక సంవత్సరంలో 91 శాతమే ఉత్పత్తి
- ముందస్తు ప్రణాళికలు లేకపోవడమే కారణమా?



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తికి గాను ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యం నెరవేరలేదు. ఈసారి 91శాతంతోనే సరిపెట్టుకున్నట్లుగా శుక్రవారం విడుదల చేసిన నివేదిక ద్వారా వెల్లడైంది. గత ఐదేళ్లుగా ఇదే తంతు కొనసాగుతుండడం గమనార్హం. సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ప్రతినెల సమీక్షలు నిర్వహిస్తూ ఏరియాల వారీ గనులకు కేటాయించిన రోజు, నెల వారీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆదేశించడమే కాక సూచనలు చేస్తున్నా ఫలితం కానరాలేదు. ఒకవైపు సింగరేణి బొగ్గుకు మంచి డిమాండ్ ఉన్నందున ఆ స్థాయిలో ఉత్పత్తి, రవాణా జరగాల్సి ఉన్నా కారణాలేమిటో కానీ ఐదేళ్ల నుంచి వార్షిక లక్ష్యాలను చేరుకోలేకపోతుండడం గమనార్హం. అయితే, వార్షిక లక్ష్యం సాధనకు ముందు నుంచి ప్రణాళికలు లేకపోవడం, ఒకవేళ ప్రణాళికలు రూపొందించినా వాటి అమలుపై పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడమే వెనుకబాటుకు కారణమని చెబుతున్నారు.

2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏరియాల వారీగా ఉత్పత్తి

ఏరియా	నిర్దేశించుకున్న లక్ష్యం	సాధించిన ఉత్పత్తి	ఉత్పత్తి శాతం
ఆర్జీ-1	39,05,354	47,00,465	120
ఇల్లెందు	4,50,000	4,86,521	108
మణుగూరు	1,15,57,808	1,18,73,508	103
శ్రీరాంపూర్	66,17,769	67,67,258	102
ఆర్జీ-2	84,70,961	84,88,262	100
ఆర్జీ-3	61,75,385	56,84,463	92
కొత్తగూడెం	1,39,46,816	1,27,57,786	91
బెల్లంపల్లి	35,85,000	29,02,630	81
మందమర్రి	54,29,311	43,32,761	80
ఆండ్రియాల	21,23,188	16,98,590	80
భూపాలపల్లి	49,40,115	28,34,016	57
మొత్తం	7,06,64,399	6,69,04,960	91
భూగర్భ గనులు	86,69,783	71,50,465	81
ఓపెన్‌కాస్ట్ గనులు	6,48,64,616	5,97,54,495	92

91 శాతం ఉత్పత్తి

సింగరేణి సంస్థ ఈ 2022–23లో నిర్దేశించుకున్న 70.60 మిలియన్ టన్నుల లక్ష్యంలో 24 భూగర్భ గనులు, 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో 66.90 మిలియన్ టన్నుల(91 శాతం) ఉత్పత్తి నమోదైంది. అయితే 24 భూగర్భ గనుల్లో 86,69,783 టన్నులకు గాను 71,50,465 టన్నులు(81 శాతం) ఉత్పత్తి సాధించగా, ఓసీల్లో 6,28,64,616 టన్నులకు గాను 5,97,54,495 టన్నుల (92 శాతం) ఉత్పత్తి సాధించగలిగారు.

వంద శాతం ఐదు ఏరియాల్లోనే...

సంస్థ విస్తరించి ఉన్న 11 ఏరియాల్లో కేవలం ఐదింట్లోనే ఈ ఆర్థిక సంవత్సరం వంద శాతం ఉత్పత్తి నమోదైంది. ఇందులో రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1 ఏరియా 120శాతం ఉత్పత్తి సాధించి అగ్రస్థానంలో నిలవగా, ఇల్లెందు ఏరియా 108శాతం, మణుగూరు ఏరియా 103 శాతంతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. అలాగే, శ్రీరాంపూర్ 102శాతం, ఆర్జీ–2 ఏరియా 100 సాధించగా మిగిలిన కొత్తగూడెం, బెల్లంపెల్లి, మందమర్రి, ఆర్జీ–2, భూపాలపల్లి, ఆండ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలు వెనుకంజలో ఉన్నాయి.

ప్రమాదరహితంగా కొత్తగూడెం ఏరియాలో ఉత్పత్తి

కొత్తగూడెం ఏరియాకు సంస్థ నిర్దేశించిన ఉత్పత్తిలో వంద శాతం సాధించకున్నా ఏ ఏరియా సాధించలేని విధంగా 12.75 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని.. సుమారు 13 మిలియన్ టన్నుల బొగ్గును రవాణా చేయగలిగామని కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ ఓ ప్రకటనల తెలిపారు. ఈ ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీకి కేటాయించిన 10 మిలియన్ టన్నుల లక్ష్యంలో వంద శాతం ఉత్పత్తి చేయడం సింగరేణి చరిత్రలోనే మైలురాయి అని చెప్పారు. అంతేకాక ఆర్థిక సంవత్సరంలో ఒక్క ప్రమాదం కూడా లేకుండా ఉత్పత్తి సాధించిన కార్మికులను ఆయన అభినందించారు.

టీఎన్జీవోస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా శృతి

సొసైటీకి పాలక వర్గం లేకపోవడంతో నిర్ణయం



శృతి మహంకాళి

ఖమ్మంవ్యవసాయం: జిల్లా టీఎన్జీవోస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా అసిస్టెంట్ రిజిస్ట్రార్ శృతి మహంకాళి నియమితులయ్యారు. సొసైటీ పాలకవర్గ పదవీకాలం మార్చి 23న ముగియడం, ప్రస్తుత సొసైటీ రెన్యూవల్ కాకపోవడంతో ఆమెను నియమించినట్లు జిల్లా సహకార అధికారి(డీసీఓ) విజయకుమారి వెల్లడించారు. హౌసింగ్ సొసైటీలో గెజిటెడ్ అధికారులు, యూనిఫాం సర్వీస్ ఉద్యోగులే కాక ప్రభుత్వ ఉద్యోగులు కాని వారిని కూడా సభ్యులుగా చేర్చుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. 2019–20లో నిర్వహించిన ఆడిట్‌లో రూ.1.02 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు, 649 మందికి నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వాలు ఇచ్చినట్లు, 2020–21 ఆడిట్‌లో రూ. 27.82 లక్షలు దుర్వినియోగం కాగా, 113 మందిని అక్రమంగా సభ్యులుగా చేర్చినట్లు గుర్తించారని సమాచారం. ఈ కారణంగా టీఎన్జీవోస్ సహకార హౌస్ బిల్డింగ్ సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించినట్లు తెలుస్తోంది. కాగా, సొసైటీ పేరిట రూ.కోట్లు వసూలు చేశారని, ఎనిమిదెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారనే ఆరోపణలు గతంలో వచ్చాయి. ఈమేరకు హౌస్ బిల్డింగ్ సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేసిన పలువురు అర్హులైన సభ్యులతో త్వరలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ పథకాలు గిరిజనులకు అందాలి

మంత్రి సత్యవతి రాథోడ్



మంత్రి సత్యవతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలంటౌన్: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. భద్రాచలంలో శుక్రవారం జరిగిన శ్రీసీతారామచంద్ర స్వామివారి పట్టాభిషేక మహోత్సవానికి హాజరైన ఆమెను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి గౌతమ్ పొట్రు, ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల సన్నద్ధత, కల్పిస్తున్న సౌకర్యాలపై వారు వివరించగా సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి.. పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్ శాఖల ఉద్యోగులు మంత్రి సత్యవతిని కలిసి సమస్య పరిష్కారంపై వినతిపత్రం అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



వర్మీ కంపోస్ట్ బెడ్లు అందిస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు, సాగులో పాటించాల్సిన మెళకువలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని మల్లాయిగూడెంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన శుక్రవారం గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా 'ఆయిల్‌పాం సాగు–సమగ్ర యాజమాన్య' పద్ధతులపై సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ సాగు, నేలలు ఎరువుల వినియోగం, చీడ పీడల నివారణ, జీవన ఎరువులపై కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ నీలిమ, డాక్టర్ ఐవీఎస్.రెడ్డి, డాక్టర్ రాంప్రసాద్ వివరించారు. అలాగే, గెలల కోత పరికరాలు, మొబైల్ వర్మీబెడ్లు, కూరగాయల విత్తనాలు, మామిడి అంట్లు, వర్మి కంపోస్టు బస్తాలు అందజేశారు. ఈ శిక్షణలో డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ సిద్దప్ప, డాక్టర్ నాగాంజలి, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి చక్రస్నానం, మహాపూర్ణాహుతి

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా శ్రీస్వామి వారి యాగశాలలో ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యాన మహా పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే, ఉత్సవాల ముగింపు సూచికగా ధ్వజావరోహణం చేశారు. ఆతర్వాత ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో(కోనేరు) శ్రీవారికి చక్రస్నానం చేయించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, రామకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు